# సంపాదకీయము

అవతార పురుషుడైన శ్రీకృష్ణపరమాత్ముని జన్మదినోత్సవము మరల జరుపుకొను సదవకాశము మనందరకు లభించినది. ఈ సందర్భములో మనము గుర్తుంచుకొనవలసినదేమనగా మన పద్ధతిలో శ్రీ కృష్ణ పరమాత్మునకు ప్రాముఖ్యత యిచ్చినప్పటికీ ఆచారములతో కూడినదేదియూ చేయునది లేదు. మన విధానములో సనాతన ధర్మమునను సరించి గతములోని మంచిని యిముడ్చుకొనిన ఒక ఉన్నతమైన సాధనా పద్ధతిని సర్వమానవాళికి మన గురుదేవులైన పూజ్య బాబూజీ మహారాజ్ గారు అందించినారు.

ద్వాపర యుగములో శ్రీ కృష్ణ భగవానుడు మహాభారత యుద్ధ సమయమున అర్జునుడిలోని నిరాసక్తిని పారద్రోలి యుద్ధోన్ముఖిని చేయుటకు గీతను బోధించెను. తదనంతరము అది మానవునిలో మానసిక వికాసమును కలుగజేసి వాని ఆధ్యాత్మిక పురోగతికి మిక్కిలి ఉపయోగకరమైనదిగా ఎందరో మహానుభావులచే కొనియాడబడి దానికి అనేకమైన భాష్యములు వెలువడినవి. దీనిలో శ్రీకృష్ణ భగవానుడు ద్వితీయ అధ్యాయములో యిట్లు బోధించెను.

“త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున
నిర్ద్వంద్వో నిత్యసత్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్”

దీని అర్థము ఏమనగా వేదములు భౌతికమైన సత్వ రజస్తమో గుణముల సమస్త భోగములను గూర్చియు, వాటిని పొందుటకై చేయవలసిన సాధనను గూర్చియు చెప్పుచున్నవి. ఈ త్రిగుణములకు అతీతుడవై నిత్యుడైన పరమాత్మయందే స్థితుడవు కమ్ము. నీ అంతఃకరణమును వశమునందుంచుకొని నీ యోగ క్షేమములకై ఆరాటపడవలదని బోధించినాడు.

స్థిరచిత్తుడై ఆ పరమాత్మయందే మనస్సు లగ్నము చేయుట యనునది, ఎంతో ఉన్నతమైన విద్యగా భావించబడి అభ్యసించుటకు బహు కష్టతరమైనదైన వేదములను కూడ మించినది మరియు ఉన్నతమైనదిగా శ్రీకృష్ణ భగవానుడు ఈ శ్లోకములో బోధించినాడు. పూజ్య బాబూజీ గారు మనకు అందించిన సత్యపథమార్గములో మన గమ్యము భగవంతునితో సంపూర్ణమగు ఏకత్వముగా దశాదేశములలో మూడవ ఆదేశములో మనకు చెప్పియున్నారు. మరియు మన విధానములో మన ఆధ్యాత్మిక పురోగతికి మన సాధనతోపాటుగా గురుదేవుల చేయూత ప్రాణాహుతి వలన మనకు లభించుచున్నది. దీనిని సాధన చేయుటవలన పరి పరి విధములుగా పోవు మనస్సును నిగ్రహించుకొని, దానిని పరమాత్మునిపై నిలిపి సమత్వస్థితిని పొంది

ఆధ్యాత్మికముగా ఉన్నతమైన గతులకు ఎదుగు అవకాశము మనకు లభించినది. ఆధ్యాత్మికముగా ఎదగవలెనను తపన ఎంతయో వున్ననూ సరియైన మార్గము, సాధనా విధానము లభ్యమగుట కష్టము. అటువంటి విధానమును ఎంతయో శ్రమకోర్చి తెలుసుకున్ననూ దానిలో మనలను నడిపించు సామర్థ్యముగల సరియైన మార్గ నిర్దేశకుడు లభించుట యించుమించు అసాధ్యమైనదే. అటువంటి విధానము, దానిలో నడిపించు సామర్థ్యముగల మార్గ నిర్దేశకులు మనకు లభించుట మన జన్మల సుకృతము. అందిన అవకాశమును సద్వినియోగపరచుకొని అనుసరించుటయే మన విజ్ఞత. ఈ ప్రయత్నములో గురుకృప సర్వదా సాధకులందరికీ లభించునని మా ప్రగాఢ విశ్వాసము.

- వి. రామం